భలే నీటి వ్యాపారం!

బాన్సువాడలోని ఓ చిన్న దుకాణంలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్

- గుర్తింపు లేకుండానే మినరల్ వాటర్ విక్రయాలు..
- ప్రజల ప్రాణాలతో చెలగాటం..
- అధికారుల నిఘా కరువు

బాన్సువాడ, జూన్ 21 : జిల్లాలో కల్తీ నీళ్లు పరవళ్లు తొక్కుతున్నాయి. నాణ్యతా ప్రమాణాలు లేని విభిన్న రూపాల్లో మంచినీళ్లు మార్కెట్‌లోకి చొచ్చుకువస్తున్నాయి. భద్రతా ప్రమాణాలు లోపించి, ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నాయి. ప్రజారోగ్యానికి ప్రాధ్యానత ఇవ్వకుండా పలు కంపెనీలు తాగునీటి వ్యాపారం చేస్తున్నాయి. బాటిళ్లు, క్యాన్లు, ప్యాకెట్ల రూపంలో విక్రయాలు కొనసాగిస్తున్నాయి. చిన్న చిన్న దుకాణాల్లో కూడా తాగునీటి ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయంటే వ్యాపారం ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. హోటళ్లు, మెస్‌లు, సినిమాహాళ్లు, క్యాంటీన్లు, కూల్‌డ్రింక్ దుకాణాల్లో మినరల్ వాటర్ పేరిట నీటి దందా కొనసాగుతున్నది. వారు సరఫరా చేసే నీటిలో నాణ్యత మాత్రం ఎండమావే. పలు గ్రామాల్లో సైతం శుద్ధి చేసిన ప్యాకేజ్డ్ తాగునీటి సరఫరాపై ఏ శాఖకూ శ్రద్ధ లేకపోవడంతో తయారుదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అసలుకు రెట్టింపు ఆదాయం ఉండడంతో జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వేసవి కాలంలోనే కోట్లాది రూపాయల వ్యాపారాన్ని సాగిస్తున్నాయి. కల్తీ, నాణ్యతలేని నీటి వ్యాపారాన్ని నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం తూతూ మంత్రం గానే పర్యవేక్షిస్తున్నది. నాణ్యత లేని తాగునీటి వ్యాపారాన్ని అరికట్టడానికి ప్రభుత్వం తాగునీటి నియంత్రణ సంస్థ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నది. ప్యాకేజ్డ్ తాగునీటిని విక్రయించాలంటే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) నిర్దేశించిన ప్రమాణాలు ఉండాలి. కొన్ని గుర్తింపు పొందిన కంపెనీలు మాత్రమే ఈ ప్రమాణాలు పాటిస్తున్నాయి. మిగతా కంపెనీలన్నీ గుర్తింపు లేకుండానే తాగునీటిని పంపిణీ చేస్తున్నాయి. పలుచోట్ల బోరునీటిని శుద్ధి చేసి హోటళ్లు, మెస్‌లు, చిన్న దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. పలుచోట్ల బ్యాంకు రుణాలు తీసుకొని మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి వారికి ఇష్టం వచ్చిన రేట్లతో విక్రయాలు సాగిస్తున్నారు. ప్యాకేజ్డ్ తాగునీటిని ఏదైనా బ్రాండ్ పేరుమీద సరఫరా చేస్తే.. అది ఆహార కల్తీ చట్టం పరిధిలోకి వస్తుంది. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ విక్రయించే సంస్థలు విధిగా భారత ప్రమాణాల సంస్థలోని 14543 నంబర్ కింద రిజిస్టర్ కావాల్సి ఉంటుంది.

తాగునీటి కల్తీ సాగెదిలా..

మినరల్ వాటర్ పేరుతో తయారు చేస్తున్న పలు కంపెనీలు స్థానికంగా లభించే బోరునీటిని శుద్ధి చేస్తారు. అనంతరం అల్ట్రావయోలెట్ ఓజోనైజేషన్ ప్రక్రియల ద్వారా సూక్ష్మ క్రిమిరహితంగా మారుస్తారు. ఇవన్నీ చేసేందుకు ఆయా కంపెనీలకు వారందించే ధరలో నాలుగోవంతు మాత్రమే ఖర్చు అవుతుంది. ఇది స్వచ్ఛమైన నీరు అని ఆయా కంపెనీలు ప్రకటించుకోవడం తప్ప ఎలాంటి భరోసా ఉండదు. పైగా ఆ బాటిళ్ల మూత తీయగానే వాటిలోకి సూక్ష్మక్రిములు ప్రవేశిస్తాయి. నాణ్యత లోపించడంతో వాంతులు, వీరేచనాలు అవుతాయి. సాధారణ ప్రమాణికాలు పాటించని మినరల్ వాటర్‌ను 24 గంటల్లోపే విక్రయించాలి.

చోద్యం చూస్తున్న ఐపీఎం..

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ లేని నీటిని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటీవ్ మెడిసిన్ (ఐపీఎం)ది అయినప్పటికీ ఆ శాఖ గుర్తింపు లేనిసంస్థలు, కంపెనీలపై దాడులు చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వంలోని వివిధ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. ప్రస్తుతం మినరల్ వాటర్ పేరుతో లభ్యమయ్యే నీటిని పర్యవేక్షిస్తున్న దాఖలాలు అరుదు. బీఐఎస్ ఐఎస్‌ఐ మార్క్ ఉన్న సంస్థలను మాత్రమే తనిఖీ చేస్తుండడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా వర్ధిల్లుతున్నది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు జిల్లాలోని మినరల్ వాటర్ ప్లాంట్లపై దాడులు చేస్తే, నాణ్యత లేని నీటి విక్రయాలను అరికట్టవచ్చు.

మల్కాపూర్‌లో సైబర్ మోసం

లోన్ వచ్చిందని రూ.30వేలకు టోకరా

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 21: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో సైబర్ మోసం వెలుగుచూసింది. ఎస్సై బొజ్జ మహేశ్ ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం వెల్లడించారు. మల్కాపూర్ గ్రామానికి చెందిన లింగంపేట్ బాలకృష్ణకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మీకు రూ.ఐదు లక్షల లోన్ మంజూరైందని తెలిపాడు. డబ్బులు మీ ఖాతాలో జమకావాలంటే.. అందుకోసం కొంత ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అతడి మాటలు నమ్మిన బాలకృష్ణ విడుతల వారీగా ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ ద్వారా చెప్పిన నంబర్‌కు రూ.30,805 జమ చేశాడు. అయినా అతడి ఖాతాలో లోన్ డబ్బులు జమ కాలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి ఎల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. కష్టపడకుండా డబ్బులు సులువుగా రావన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.

తల్లి పక్క నుంచి బాలుడు అదృశ్యం

నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ఘటన



తప్పిపోయిన బాలుడు

వినాయక్‌నగర్, జూన్ 21 : నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ఓ తల్లి తన రెండేండ్ల బాబుతో నిద్రించింది. కొన్ని గంటల అనంతరం ఆమెకు మెళకువ వచ్చి చూడగా తన పక్కలో నిద్రిస్తున్న బాబు కనిపించలేదు. దీంతో ఆమె రోదిస్తూ తన బాబు కోసం రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫాంలతో పాటు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. చివరికి బాధితురాలు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మదన్‌పల్లి గ్రామానికి చెందిన ధనేవాడ పింకీ తన రెండేండ్ల బాబు మహేందర్‌తో కలిసి కామారెడ్డికి వెళ్లి వచ్చిన ఆమె గురువారం రాత్రి రైల్వేస్టేషన్‌లో నిద్రించింది. అర్ధరాత్రి 2 గంటల తర్వాత మెళకువ రాగా.. ఆమె కుమారుడు పక్కన కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, బాలుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58591 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

కత్తిపోట్లకు గురైన వ్యక్తి మృతి

నాగిరెడ్డిపేట, జూన్21 : మండలంలోని రాఘవపల్లిలో కత్తిపోట్లకు గురైన నార్ల నాగయ్య (55) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడని ఎస్సై రాజు తెలిపారు. నాగయ్య ఈనెల 18వ తేదీన రాత్రి కత్తిపోట్లకు గురయ్యాడు. అతడిని చికిత్స కోసం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. అతడికి గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని ఎస్సై తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించామన్నారు. కత్తిపోట్ల కేసు విచారణలో ఉన్నదని, పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని తెలిపారు.

యువకుడి దారుణ హత్య

వినాయక్‌నగర్, జూన్ 21 : రాయితో మోది ఓ వ్యకిని దారుణంగా హత్యచేసిన ఘటన జిల్లాకేంద్రంలోని బోధన్ బస్టాండ్ ఏరియాలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. కాగా హత్యకు గల కారణాలు తెలియరాలేదు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు కథనం ప్రకారం.. జన్నేపల్లి ఎక్స్ రోడ్డులోని సీడబ్ల్యూసీ గోదాం వద్ద నివాసముండే షేక్ మహబూబ్ (30) మేస్త్రీ పని చేస్తుంటాడు. సదరు యువకుడిపై నగరంలోని ముస్తాయిపురాకు చెందిన సయ్యద్ అమీర్ బండరాయితో దాడి చేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. మృతిచెందాడు. ఇందుకు కారణమైన సయ్యద్ అమీర్‌పై మర్డర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

హైవేపై ట్రాక్టర్ బోల్తా

- ఒకరి దుర్మరణం.. 14మందికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం
- మొక్కు చెల్లించుకొని వస్తుండగా ప్రమాదం
- జుక్కల్ చౌరస్తా వద్ద ఘటన

దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితురాలు

క్రేన్ సహాయంతో ట్రాక్టర్‌ను తొలగిస్తున్న పోలీసులు

బిచ్కుంద, జూన్ 21: జాతీయ రహదారిపై ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతిచెందగా.. 14మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. జుక్కల్ ఎస్సై సత్యనారాయణ తెలిపిన ప్రకారం ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన ఒర్సు వెంకవ్వ మొక్కును చెల్లించుకోవడానికి బంధుమిత్రులతో కలిసి ట్రాక్టర్‌లో జుక్కల్ మండలంలోని కౌలాస్‌కోటలో ఉన్న ఎల్లమ్మ దర్శణానికి శుక్రవారం ఉదయం వెళ్లారు. మొక్కు చెల్లించుకొని భోజనాలు చేసిన అనంతరం తిరిగి బిచ్కుందకు బయల్దేదారు. మార్గమధ్యంలో జుక్కల్ చౌరస్తా వద్ద ట్రాక్టర్ బోల్తా పడడంతో అందులో ఉన్న అంజలి(16) అక్కడికక్కడే మృతిచెందింది. 14మందికి గాయాలవగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాక్టర్‌లో 35 మంది ఉన్నారని ఎస్సై తెలిపారు. డ్రైవర్ మద్యం మత్తులో ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. క్రేన్ సహాయంతో ట్రాక్టర్‌ను హైవే పైనుంచి పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. క్షతగాత్రులను బిచ్కుంద దవాఖానకు తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని అక్కడి నుంచి బాన్సువాడకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

24 నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు నోటీసు అందజేత

ఖలీల్‌వాడి, జూన్ 21: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 24 నుంచి జూనియర్ డాక్టర్లు సమ్మె చేపట్టనున్నట్లు జూనియన్ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ప్రభుత్వ దవాఖానలో సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ నాగమోహన్‌కు సమ్మె నోటీసును అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెలలో తాత్కాలికంగా నిలిపివేసిన సమ్మెను తిరిగి కొనసాగించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సురేశ్, జూనియర్ డాక్టర్లు ఉన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న జూడాలు

పసిడి-వెండి జిగేల్

- ఒక్కరోజే రూ.810 పెరిగిన తులం బంగారం
- 1,500 ఎగిసిన కిలో వెండి రేటు

న్యూఢిల్లీ, జూన్ 21: బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. శుక్రవారం హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ పుత్తడి రేటు రూ.810 పుంజుకొని రూ.73,250ని చేరింది. 22 క్యారెట్ ధర రూ.750 అందుకుని రూ.67,150గా నమోదైంది. వరుసగా 4 రోజులు స్థిరంగా లేదా పడిపోతూ వచ్చిన పసిడి విలువ.. గురువారం కూడా పెరిగిన విషయం తెలిసిందే. ఇక వెండి ధర మరో రూ.1,500 ఎగబాకింది. కిలో 94,000 పలుకుతున్నది. క్రితం రోజు కూడా రూ.1,500 ఎగిసిన సంగతి విదితమే. ఢిల్లీలోనూ 24 క్యారెట్ బంగారం రూ.73,350గా, కిలో వెండి రూ.93,700గా ఉన్నది. ఈ ఒక్కరోజే రూ.800, రూ.1,400 చొప్పున ఎగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే.. కొమెక్స్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర ఒకేసారి 28 డాలర్లు పెరిగి 2,360 డాలర్లు పలికింది. ఔన్సు వెండి 30.40 డాలర్లుగా ఉన్నది.

జీఎస్టీ స్లాబులు తగ్గాలి: జీటీఆర్ఐ

న్యూఢిల్లీ, జూన్ 21: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్లాబుల సంఖ్యను తగ్గించాలని గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) కేంద్ర ప్రభుత్వానికి, జీఎస్టీ మండలికి శుక్రవారం సూచించింది. శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ 53వ సమావేశం జరుగనున్నది. ఈ క్రమంలోనే జీఎస్టీ మినహాయింపు పరిమితిని రూ.1.5 కోట్ల వార్షిక టర్నోవర్‌దాకా ఉన్న అన్ని సంస్థలకు పెంచాలని కూడా జీటీఆర్ఐ కోరింది. ప్రస్తుతం ఇది రూ.40 లక్షలుగానే ఉన్నది. పరిమితిని పెంచితే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)లకు లబ్ధి చేకూరుతుందని, ఉద్యోగ-ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జీటీఆర్ఐ ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. ఇక రాష్ట్రాలవారీ రిజిస్ట్రేషన్లను దూరం పెట్టాలన్నది. కాగా, శనివారం భేటీలో ఆన్‌లైన్ గేమింగ్‌పై పన్ను వేయడంతోపాటు, ఎరువులపై పన్నును తగ్గించాలన్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సులపై చర్చ జరిగే వీలున్నది. ప్రస్తుతం ఎరువులపై 5 శాతం జీఎస్టీ పడుతున్నది. సల్ఫ్యూరిక్ యాసిడ్, అమ్మోనియా తదితర ముడి సరకులపై 18 శాతం వర్తిస్తున్నది. జీఎస్టీలో ఇప్పుడు 5, 12, 18, 28 శాతం స్లాబులున్న విషయం తెలిసిందే. మరోవైపు జీఎస్టీ రేటుపై హేతుబద్ధ కమిటీ ఏర్పాటైంది. బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి కన్వీనర్‌గా నియమితులయ్యారు.

యులిప్‌లు పెట్టుబడులు కావు

- బీమా రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ, జూన్ 21: యునిట్ లింక్డ్ బీమా ప్లాన్ల(యులిప్)ను పెట్టుబడి పథకాలుగా ప్రచారం చేయవద్దని బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ బీమా సంస్థలకు సూచించింది. యులిప్‌లను పెట్టుబడి పథకాలుగా బీమా సంస్థలు ఇటీవల కాలంలో ప్రచారం చేస్తున్నాయని, ఇది సరైనది కాదని శుక్రవారం జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. మార్కెట్-లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీలు సాంప్రదాయ ఎండోమెంట్ పాలసీలకంటే భిన్నంగా ఉన్నాయని, ఇవి రిస్క్‌లను కలిగివుంటాయని బీమా సంస్థలు ప్రత్యేకంగా పేర్కొనాలని సూచించింది. అదేవిధంగా బోనస్‌తో కూడిన ఎండోమెంట్ పాలసీల బెనిఫిట్‌లో బోనస్‌లకు గ్యారెంటీ లేదని ముందుగానే చెప్పాలని సూచించింది. అన్ని ప్రకటనలు బీమా పాలసీకి, యాన్యుటీ ప్రొడక్ట్‌కు సంబంధించినవి మాత్రమే ప్రచారం చేయాలని పేర్కొంది.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.6,959.29 కోట్ల డివిడెండ్ చెక్‌ను అందజేస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఎస్బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా

ఆర్థిక అసమానతలు తగ్గవు!

రాయిటర్స్ పోల్‌లో 84 శాతం ఆర్థికవేత్తల అభిప్రాయమిదే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)



హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రానున్న ఐదేండ్లలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడమే తన లక్ష్యమని లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఊదరగొట్టారు. భారత్ మెరుగైన వృద్ధిరేటుతో దూసుకుపోతున్నదని కేంద్రప్రభుత్వ ఏజెన్సీలూ గతకొంతకాలంగా ప్రచారం చేస్తున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధి 8 శాతం వరకు ఉన్నట్టు కేంద్రం ప్రకటించింది. అయితే, ఎవరెన్ని చెప్పినప్పటికీ, దేశంలో ఆర్థిక అసమానతలు మాత్రం తగ్గే సూచనలు కనిపించడం లేదని ఆర్థిక నిపుణులు, మేధావులు తేల్చిచెప్తున్నారు. స్టాక్‌మార్కెట్ల సూచీలు, జీడీపీ వృద్ధిరేటును చూసి పేదలు, మధ్యతరగతి వర్గాలకు లాభం చేకూరుతుందని అనుకొంటే అది పొరపాటేనని చెబుతున్నారు. రానున్న ఐదేండ్ల మోదీ ప్రభుత్వ హయాంలో పేదలకు కొత్తగా ఒరగబోయేది ఏమీ ఉండబోదని స్పష్టం చేస్తున్నారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో.. ఇప్పటికీ 80 కోట్ల మందికి ఉచిత బియ్యం సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ పత్రిక 'రాయిటర్స్' సంస్థ మే 15-జూన్ 18 మధ్య నిర్వహించిన పోల్‌లో వెల్లడైంది. పోల్‌లో పాల్గొన్న మొత్తం 51 మంది ఆర్థికవేత్తల్లో .. ఏకంగా 43 మంది రానున్న ఐదేండ్లలో మోదీ హయాంలో దేశంలో ఆర్థిక అసమానతలు తగ్గే అవకాశమే లేదని, పేదల కష్టాలు తీరబోవని తేల్చిచెప్పడం గమనార్హం.

మెజారిటీ తగ్గడానికి కారణం ఇదే

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ సీట్లు రాకపోవడానికి కారణాలను కూడా ఆర్థికవేత్తలు విశ్లేషించారు. దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలు, పెచ్చరిల్లిన నిరుద్యోగమే దీనికి కారణంగా వివరించారు. 2047లోగా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తానని ప్రధాని అంటున్నారని, అయితే, నైపుణ్యం కలిగిన మానవ వనరులను పెంచడం, నిరుద్యోగాన్ని రూపుమాపడం, సమ్మిళిత వృద్ధితోనే ఇది సాధ్యమౌతుందని ఆర్థిక నిపుణులు సూచించారు. దేశ ఆర్థిక ప్రగతికి నిరుద్యోగమే పెద్ద సమస్యగా మారిందని పోల్‌లో పాల్గొన్న 90 శాతం మంది అభిప్రాయపడ్డారు.

ధనికులు మరింత సంపన్నులుగా..

ప్రస్తుత ప్రభుత్వం తీసుకొస్తున్న విధానపరమైన నిర్ణయాలతో మధ్యతరగతి వర్గాల నడ్డివిరుగుతున్నది. ఉచితాల కోసం పేదలు ప్రభుత్వంపై పూర్తిగా ఆధారపడే దుస్థితి దాపురించింది. అయితే, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, చేయూతతో ధనికులు మరింత సంపన్నులుగా మారుతున్నారు.

- సాయిబాల్‌కర్, ప్రొఫెసర్, సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సోషల్ సైన్సెస్

తగ్గిన ఫారెక్స్ నిల్వలు



ముంబై, జూన్ 21: విదేశీ మారకం నిల్వలు మళ్లీ కరిగిపోయాయి. ఈ నెల 14తో ముగిసిన వారాంతానికిగాను 2.922 బిలియన్ డాలర్లు తగ్గి 652.895 బిలియన్ డాలర్లకు చేరాయని రిజర్వు బ్యాంక్ వెల్లడించింది. అంతక్రితం వారం రికార్డు స్థాయి 655.817 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. గత వారంలో విదేశీ కరెన్సీల రూపంలో ఉన్న ఆస్తుల విలువ 2.097 బిలియన్ డాలర్లు తగ్గి 574.24 బిలియన్ డాలర్లకు చేరడం ఇందుకు కారణమని తెలిపింది. యూరో, పౌండ్, యెన్ కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురికావడం విదేశీ రిజర్వులపై ప్రతికూల ప్రభావం చూపింది. బంగా రం రిజర్వులు కూడా 1.015 బిలియన్ డాలర్లు తగ్గి 55.967 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఎస్‌డీఆర్‌లు 54 మిలియన్ డాలర్లు తగ్గి 18.107 బిలియన్ డాలర్లకు పడిపోగా, ఐఎంఎఫ్ వద్ద నిల్వలు 245 మిలియన్ డాలర్లు పెరిగి 4.581 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

బడ్జెట్‌లో రోబో ట్యాక్స్?

ప్రతిపాదనను పరిశీలిస్తున్న కేంద్రం





న్యూఢిల్లీ, జూన్ 21: రాబోయే బడ్జెట్‌లో కొత్తగా 'రోబో ట్యాక్స్'ను కేంద్ర ప్రభుత్వం తీసుకురానుందా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ మేరకు ప్రతిపాదన వచ్చినట్టు తెలుస్తుండగా, దీన్ని అమల్లోకి తెచ్చే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను వచ్చే నెల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నారు. దీంతో వృద్ధిరేటు, ఉద్యోగ కల్పన, ఆర్థిక విధానాలు, పెట్టుబడులు, రుణ భారం, ఆహార ద్రవ్యోల్బణం వంటి ప్రధానాంశాలపై ఆయా రంగాల పెద్దలతో, ఆర్థిక నిపుణులతో మంత్రి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే 'రోబో ట్యాక్స్' పరిశీలన తెరపైకి వచ్చింది.

ఏమిటిది?

కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావంతో ఇటీవలికాలంలో ఉద్యోగాలు పెద్ద ఎత్తున పోతున్నాయి. బడా కార్పొరేట్ సంస్థలన్నీ మానవ శక్తికి బదులుగా రోబో ఆధారిత శక్తిపై దృష్టి సారిస్తున్న ఫలితమే ఇదంతా. దీంతో ఏఐ కారణంగా కొలువుల్ని కోల్పోయినవారిలో నైపుణ్యం పెంచేందుకు, అందుకయ్యే ఖర్చులకు నిధుల సమీకరణ కోసం ఓ ఆర్థికవేత్త నుంచి వచ్చినదే ఈ 'రోబో ట్యాక్స్' ప్రతిపాదన. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పేపర్‌కు అనుగుణంగానే దీన్ని ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. ఏఐ రాకతో లాభాలున్నా.. భారీగా ఉద్యోగాలు పోతాయని, చాలామందికి ఇది బాధాకరమని ఐఎంఎఫ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. అందుకే నైపుణ్యాభివృద్ధి, నిరుద్యోగ బీమా కవరేజీ, వేతన బీమాలతోపాటు ప్రస్తుత కార్పొరేట్ ట్యాక్స్ వ్యవస్థల్ని పునఃసమీక్షించాలని ఐఎంఎఫ్ ప్రపంచ దేశాలకు సలహా కూడా ఇచ్చింది. ఇక అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏఐతో పెద్ద ముప్పే పొంచి ఉన్నదని ఐఎంఎఫ్ తొలి డిప్యూటీ ఎండీ గీతా గోపీనాథ్ కూడా హెచ్చరించినది తెలిసిందే.

వ్యవసాయానికి పెద్దపీట వేయాలి

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో శుక్రవారం జరిపిన ముందస్తు బడ్జెట్ చర్చల్లో వ్యవసాయ రంగ సంఘాలు, నిపుణులు.. వ్యవసాయ సంబంధిత పరిశోధనలకు ప్రాధాన్యతనివ్వాలని కోరాయి. అలాగే ఎరువుల సబ్సిడీని హేతుబద్ధం చేయాలని, వాతావరణ మార్పులతో తలెత్తుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, వ్యవసాయ రంగ స్థితిస్థాపకతకు తోడ్పడేలా కావాల్సిన అన్ని మౌలిక వసతులను కల్పించాలని సూచించాయి. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి కోసం ఈసారి బడ్జెట్‌లో రూ.20,000 కోట్ల నిధులు కేటాయించాలన్న డిమాండ్లు వినిపించాయి.

పన్నులు తగ్గించాలి

మార్కెట్‌లో మందగించిన డిమాండ్‌ను తిరిగి ఉత్తేజపర్చేందుకు వ్యక్తిగత పన్నులను తగ్గించాలని భారతీయ రిటైలర్ల సంఘం కోరింది. తక్కువ వడ్డీకే రుణాలు, భూముల ధరలపై రాయితీలు, ప్రయోజనాలు ఇవ్వాలన్నది. విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలనూ కల్పించాలన్నది. వ్యవసాయం తర్వాత అత్యధికులు ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారని గుర్తుచేసింది. దుకాణాలు నిరంతరం తెర్చుకునేలా వీలు కల్పించాలన్నది.

వాణిజ్య

టెక్టోరోకు గూగుల్ గ్రోత్ అవార్డు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్‌లో విశేషమైన సహకారం అందించినందుకుగాను గూగుల్ నుంచి ప్రతిష్ఠాత్మక యాక్సిలరేటర్ అవార్డును అందుకున్నది టెక్టోరో కన్సల్టింగ్ సంస్థ. లండన్‌లో జరిగిన ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ గ్లోబల్ పార్ట్‌నర్ సమ్మిట్‌లో ఈ అవార్డును టెక్టోరో ఎండీ శ్రీధర్ దన్నపనేని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ దన్నపనేని మాట్లాడుతూ.. గ్రోత్ యాక్సిలరేటర్ అవార్డును అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ గుర్తింపు అంకితభావంతో కూడిన మా బృందానికి, వారి కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు.

జేకే టైర్ 120 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జూన్ 21: ప్రముఖ టైర్ల సంస్థ జేకే టైర్..కమర్షియల్ వాహనాలను దృష్టిలో పెట్టుకొని మార్కెట్లోకి మరో నాలుగు టైర్లను విడుదల చేసింది. ఈ సందర్భంగా కంపెనీ ప్రెసిడెంట్ అనుజ్ కథూరియా మాట్లాడుతూ.. అడ్వాన్స్ టెక్నాలజీతో రూపొందించిన ఈ టైర్లతో కమర్షియల్ వాహనాల నిర్వహణ ఖర్చులు తగ్గుముఖం పట్టనున్నాయని, ఈ నూతన శ్రేణి టైర్లను రూపొందించడానికి మైసూరులో రూ.600 కోట్ల పెట్టుబడితో ప్రత్యేకంగా పరిశోధన-అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే ఆర్‌అండ్‌డీ కోసం ప్రతియేటా రూ.120 కోట్ల మేర పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపారు.

ఫార్మా కోసం ప్రత్యేక క్లస్టర్!

హైదరాబాద్, జూన్ 21: ఫార్మా సర్వీసుల కోసం ప్రత్యేక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఫార్మా రంగ ప్రతినిధులు సూచించారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఫార్మా రంగ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ తెలంగాణ ఫార్మా అండ్ లైఫ్ సెన్సెస్ ప్యానెల్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కన్వీనర్ శిల్పా రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో 800కి పైగా లైఫ్ సెన్సెస్ కంపెనీల విలువ 50 బిలియన్ డాలర్లకు పైగా ఉన్నదని, అలాగే దేశీయ ఫార్మా ఉత్పత్తుల్లో ఇక్కడి నుంచే 40 శాతం ఉత్పత్తి అవుతున్నాయన్నారు. ఇందుకోసం కొత్తగా ప్రత్యేక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.